క్లుప్తంగా

నాలుగు రోజులు నీటి సరఫరాకు అంతరాయం

కర్నూలు (టౌన్): నగరంలోని దేవనగర్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద ఉన్న 250 ఎంఎండయా పైపులైన్ లీకేజీకి గురికావడంతో నాలుగురోజుల పాటు (ఈనెల 6 వ తేది వరకు) నీటి సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవనగర్, పాల కొట్టాలు, ఠాకూర్ నగర్, బిర్లాగడ్డ, గాయత్రీ ఎస్టేట్, లక్ష్మీనగర్, మద్దూరునగర్, జేఎస్‌ఆర్ కల్లూరు ప్రాంతంలోని విఠల్ నగర్, రాజీవ్ నగర్, సవరమ్మ గుడి, ఆర్‌సీఎం కాంప్లెక్స్ ప్రాంతాల ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని తెలిపారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కర్నూలు(సెంట్రల్) : రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.మొహమ్మద్, సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జమ్మిచెట్టు దగ్గర ఆటో యూనియన్ ఆటో స్టాండ్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఈచీసీఆర్ చలానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులను వేధించడం పోలీసులకు తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.కుమార్, రామాంజనేయులు పాల్గొన్నారు.

రజక సంఘం యువజన విభాగం ఏర్పాటు

కర్నూలు(అర్బన్): రజక ఐక్య సేవా సమితిని బలోపేతం చేసే ప్రక్రియలో భాగంగా యువజన విభాగాలను ఏర్పాటు చేస్తున్నట్లు సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎం రాంబాబు తెలిపారు. ఆదివారం నగరంలోని బీసీ భవన్‌లో సేవా సమితి యూత్ నగర అధ్యక్షుడిగా బి. సూర్యనారాయణ, ఉపాధ్యక్షులుగా బి. బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా భరత్‌కుమార్, కార్యదర్శిగా బి. మధుబాబు, కోశాధికారిగా జి. రఘువరన్‌తో పాటు మరో 14 మందితో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు కేతూరి మధు, చంద్రశేఖర్, రాజు, లక్ష్మన్న, బీసన్న, గోల్డ్‌మెన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలు


కర్నూలు సిటీ: ఎస్‌ఎఫ్‌ఐ 47వ మహాసభల ముగింపు కార్యక్రమాన్ని కార్మిక, కర్షక భవనంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఎండోక్రైనాజిస్టు డాక్టర్ భరత్ అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థి దశలో నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను నీరుగార్చేందుకు నూతన విద్యా విధానం ప్రవేశపెట్టాయన్నారు. సమావేశంలో ఆ సంఘం మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి నరసింహ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా, ఉపాధ్యక్షులు సాయిశ్రీను, రవిసాయి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రెడాయ్ ప్రాపర్టీ షో


కేజే రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన క్రెడాయ్ ప్రాపర్టీ, బిల్డ్ టెక్ ప్రదర్శన ఆదివారం సాయంత్రం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఇళ్ల స్థలాలు, ఇంటిసామగ్రి కొనుగోలుదారులకు ప్రాపర్టీ షో చక్కగా ఉపయోగపడుతుందన్నారు. క్రెడాయ్ సంస్థ అధ్యక్షుడు సాయిరాం రెడ్డి, కన్వీనర్ శ్రీనివాసరావు, స్కంధాన్షీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ సుబ్రమణ్యం శాస్త్రి మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ ప్రదర్శనకు నగర ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్రెడాయ్ సభ్యులను సన్మానించారు.

సాక్షి సినిమాలు



ఎస్‌వీసీ కాంప్లెక్స్ : ఎనిమల్
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : ఎనిమల్, భగవంత్ కేసరి, కాలింగ్ సహస్ర, శ్యామ్ బహదూర్, అథర్వ,బ్రీత్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : ఎనిమల్, విక్రమ్ రాథోడ్, ఆది కేశవ
ఐనాక్స్ : శ్యామ్ బహదూర్, కోటబొమ్మాళి పీఎస్, అథర్వ, టైగర్ 3, ఉపేంద్ర గాడి అడ్డా, బ్రీత్
భరత్ కాంప్లెక్స్ : ఓటు (చాలా విలువైనది)
శ్రీరామ : ఎనిమల్
రాజ్ : ఎనిమల్, విజయ : ఎనిమల్

కార్తీక వనభో'జనాల' సందడి


టి.శేషన్న నగర్‌లో సామూహిక వనభోజనం చేస్తున్న గంగపుత్రులు


వెంగన్నబావి సమీపంలో దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న రజకులు


ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న ఎంపీ డా.ఎస్ సంజీవ్‌కుమార్


ఎంపీ గోరంట్ల మాధవ్‌ను సన్మానిస్తున్న కురువ సంఘం నేతలు

- హాజరైన ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు
- భక్తిశ్రద్ధలతో ఉసిరి చెట్టుకు పూజలు
- ఆకట్టుకున్న చిన్నారుల, మహిళల సాంస్కృతిక కార్యక్రమాలు

కర్నూలు(అర్బన్): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఎక్కడ చూసినా వనభోజనాల సందడి కనిపిస్తోంది. సెలవుదినమైన ఆదివారం పలు కుల సంఘాలు వనభోజన కార్యక్రమాలు ఏర్పాటు చేసుకున్నారు. సంస్కృతి, సంప్రదాయాల మధ్య భక్తితో ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో ఆయా కులాలకు చెందిన మహిళలు, చిన్నారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక వనభోజనాలు చేశారు. ఆయా కుల సంఘాలకు చెందిన ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సామూహిక వనభోజనాల తర్వాత మహిళలు, చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

➤ నగర శివారులోని టి. శేషన్న నగర్ బెస్త కమ్యూనిటీ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సంక్షేమ సంఘం (తెలుగు, బెస్త, గంగపుత్ర) ఆధ్వర్యంలో నిర్వహించిన వనభోజన మహోత్సవానికి రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి డా. సీదిరి అప్పలరాజు, కర్నూలు, పాణ్యం ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్‌వీ మోహన్‌రెడ్డి, లబ్బి వెంకటస్వామి, నాయకులు అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

➤నగరంలోని పెద్దపార్కు కిడ్స్ వరల్డ్‌లో కర్నూలు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వనభోజన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎంపీ డా.ఎస్ సంజీవ్‌కుమార్ పాల్గొని శివకేశవులకు పూజలు నిర్వహించారు.


వనభోజన కార్యక్రమానికి హాజరైన గంగపుత్రులు

➤కురువ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పెద్దపాడు సమీపంలోని బీర లింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, బీసీ కమిషన్ సభ్యులు కిష్టప్ప, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామితో పాటు కురువ సంఘం నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

➤ కుర్ని (నేసే) కులస్తుల వనభోజన కార్యక్రమం నగ ర శివారులోని వెంగన్నబావి సమీపంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం రాష్ట్ర కుర్ని సంక్షేమ సంఘం అధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, రాష్ట్ర కుర్ని ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మాదుగుండు కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గడిగె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రంగం ప్రజా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో కళా ప్రదర్శన

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో టెర్రస్ గార్డెనింగ్‌లో రాణిస్తున్న మహిళలు మొదటిసారిగా కర్నూలు శివారులోని విజయవనంలో కార్తీక వనమహోత్సవం నిర్వహించారు. టెర్రస్ గార్డెన్‌లో అరుదుగా పెంచుతున్న వివిధ రకాల మొక్కలను ఒకరికొకరు పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామానికి చెందిన వర్మికంపోస్టు తయారీలో అద్భుతంగా రాణిస్తున్న హరికృష్ణ సమన్వయకర్తగా వ్యవహరించారు.

కర్నూలు కల్చరల్: రంగం ప్రజా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధనను పురస్కరించుకుని ఆదివారం వీఆర్ కాలనీలోని పున్నమి రెస్టారెంట్ ఆవరణలో నిర్వహించిన ఆట పాట రంగోత్సవం ఉత్సాహంగా సాగింది. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు, రాజ్య సభ సభ్యులు మోపిదేవి వెంకట రమణ, పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, కర్నూలు టీడీపీ ఇన్‌చార్జ్ టీజీ భరత్ అతిథులుగా పాల్గొన్నారు. మంత్రి అప్పల రాజు మాట్లాడుతూ యువత తమకు ఇష్టమైన రంగాల్లో రాణించాలన్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్ కొట్టె చెన్నయ్య, కేవీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లాలెప్ప, రంగం రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్‌బాబు, కార్యదర్శి రాజేష్, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు ఐక్యత చాటాలి

ఆర్యవైశ్యులందరూ ఐక్యత చాటాలని రాజ్య సభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. ఆదివారం నగర శివారులోని గాయత్రీ గోశాలలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళన కార్తీక వన భోజన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు కలిసి ఉండి సమస్యలు తీర్చుకోవాలన్నారు. దేశంలో ఆర్యవైశ్యులకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. టీడీపీ నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీజీ భరత్, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించండి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పెద్ద ఎత్తున చిరుధాన్యాల సాగు చేపట్టే విధంగా రైతులను ప్రోత్సహించాలని ఆత్మ వ్యవసాయ అధికారి మధుమతి ఇన్‌పుట్ డీలర్లను అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లొమ కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మధుమతి చిరుధాన్యాల పంటల సాగు అవశ్యకతపై అవగాహన కల్పించారు. వర్షాధారం, నీటి ఆధారం కింద కూడా చిరుధాన్యాల పంటలైన కొర్ర, రాగులు, అండుకొర్రలు, సామలు, ఆరికలు, సజ్జలు వంటి వాటిని సాగు చేసుకోవచ్చని సూచించారు. చిరుధాన్యాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, ధరలు కూడా ఆశాజనకంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత జేడీఏ, దేశీ డిప్లొమ కోర్సు సమన్వయకర్త జమచంద్ర, 40 మంది ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

అలరించిన 'రావణ' పద్య నాటకం


నాటకంలో ఓ సన్నివేశం

కర్నూలు కల్చరల్: తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం కళాకారులు ఆదివారం టీజీవీ కళాక్షేత్రంలో ప్రదర్శించిన 'రావణ ' పద్య నాటకం అలరించింది. తడకమళ్ల రామచంద్రరావు దర్శకత్వంలో నాటకం ప్రదర్శించ బడింది. ప్రముఖ పారిశ్రామిక వేత్త, ఐకాన్ అవార్డు గ్రహీత ఆదర్శ అనంతయ్య నాయుడు కళాకారులకు రూ.60 వేలు ఆర్థిక సాయం చేసి ప్రసంగించారు. త్వరలో కర్నూలులో సినిమా, సీరియల్స్ షూటింగ్ చేసుకోవడానికి అనంత ఫిల్మ్ నగర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడారు. కార్యక్రమంలో కళాక్షే క్షేత్రం సభ్యులు మహమ్మద్ మియ్యా, సీవీ రెడ్డి, రాజారత్నం, క్రిష్టఫర్, లక్ష్మీకాంతరావు, పాండు రంగయ్య, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

175 సీట్లు గెలవాలని..



కర్నూలు చేరుకున్న ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు కట్టెపోగు బసవరావు పాదయాత్ర

కర్నూలు(హాస్పిటల్): వచ్చే సాధారణ ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ 175కు 175 సీట్లు గెలవాలని ఆకాంక్షిస్తూ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు కట్టెపోగు బసవరావు పాదయాత్ర చేపట్టారు. గత నెల 15వ తేదీన వైఎస్ఆర్ జిల్లా ఇడుపులపాయ నుంచి ఆయన ప్రారంభించిన పాదయాత్ర ఆదివారం కర్నూలు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో 175 సీట్లు గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నారని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తాను పాదయాత్ర చేపట్టినట్లు ఆయన తెలిపారు. తాను చేసే పాదయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని, అన్ని చోట్ల ఆశీర్వాదం ఇస్తున్నారని చెప్పారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 17వ తేదీన ఇచ్ఛాపురంలో పాదయాత్ర ముగుస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఆత్మహత్యలను నివారించవచ్చు


డాక్టర్ జ్యోతిర్మయిని సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో జరిగే వ్యక్తుల ఆత్మహత్యలను నివారించవచ్చని సైకాలజిస్టు డాక్టర్ జ్యోతిర్మయి చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ ఎప్పుడూ నవ్వుతూ ఉండే వ్యక్తులు ఉన్నట్లుండి మౌనంగా, దిగులుగా ఉంటే అలాంటి వారి ని ఓ కంట కనిపెట్టాలన్నారు. వారి బాధలను గుర్తించి వాటిని తీర్చేందుకు ప్రయత్నించాలన్నారు. ఆ వ్యక్తి ఇంట్లో వాడైనా, బయటి వ్యక్తి అయినా ఆత్మహత్యలను నివారించడమొక్కటే ప్రధానమన్నారు. మన దేశంలో ప్రతి సంవత్సరం 7లక్షల మంది ఆత్మహత్యలు చేసుకుని మరణిస్తున్నారని, ఇది చాలా బాధాకర విషయమన్నారు. అనంతరం ఆమెను ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డాక్టర్ భవానీప్రసాద్, కల్కూర చంద్రశేఖర్, ఎలమర్తి రమణయ్య, జేఎస్‌ఆర్‌కే శర్మ, లక్ష్మన్న పాల్గొన్నారు.

జానపద కళాకారులకు రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎన్ రసూల్

కర్నూలు(సెంట్రల్): గ్రామీణ ప్రాంతాల్లో కనుమరుగవుతున్న జానపద కళను పోషించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రజానాట్య మండలి జిల్లా ఇన్‌చార్జ్ ఎస్ఎన్ రసూల్ కోరారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ప్రజా నాట్యమండలి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జానపద కళాకారులకు రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. డప్పు కళాకారుల పెన్షన్‌ను కూడా రూ.6 వేలకు పెంచడం తోపాటు వృద్ధ కళాకారులకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మగురుడు, వెంటకరాముడు, మాణిక్యం, హుస్సేన్, రఘు, శివ, మహేష్, కావ్య, లక్ష్మీ, ప్రకాష్ పాల్గొన్నారు.

భగవద్గీత పఠన పోటీల విజేతలు వీరే


విజేతలకు బహుమతులు అందజేస్తున్న చిన్మయ మిషన్ ఇన్‌చార్జ్ స్వామిని సుప్రేమానంద సరస్వతి

కర్నూలు కల్చరల్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి భగవద్గీత శ్లోకాల పఠన పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. వీఆర్ కాలనీలోని చిన్మయ మిషన్ కేంద్రంలో ఆదివారం పోటీలు నిర్వహించారు. యువ పారిశ్రామిక వేత్త టీజీ భరత్, చిన్మయ మిషన్ కేంద్రం అధ్యక్షుడు ఐ.విజయకుమార్‌రెడ్డి, ఇన్‌చార్జ్ స్వామిని సుప్రేమానంద సరస్వతి పోటీలను ప్రారంభించారు. ఇందులో సుమారు 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గ్రూప్- ఏలో ఆదోని సాందీపనీ విద్యాలయ యూకేజీ విద్యార్థి జీషన్, గ్రూప్-బిలో ఆదోని నేషనల్ పాఠశాల ఒకటో తరగతి విద్యార్థి కె.విమల్‌కుమార్, గ్రూప్-సిలో ఆదోని సాందీపనీ విద్యాలయ 4వ తరగతి విద్యార్థి అజయ్‌కుమార్, గ్రూప్-డిలో కర్నూలు శ్రీచైతన్య పాఠశాల 6వ తరగతి విద్యార్థి కె.రుత్విక్ రాజ్, గ్రూప్-ఇలో కర్నూలు విద్యానగర్ మాంటిస్సోరి పాఠశాల 9వ తరగతి విద్యార్థి బి.నిత్యశ్రీ హర్షిణి, గ్రూప్-ఎఫ్‌లో ఆదోని చిన్మయ విద్యాలయ విద్యార్థిని సి.హరిణి విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా చిన్మయ మిషన్ ఇన్‌చార్జ్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలు ఈ నెల 17వ తేదీన ఒంగోలులోని కొత్తపట్టణం చిన్మయ మిషన్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ కార్యదర్శి టి.వి. రత్న ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

జాతీయ పోటీలకు కర్నూలు క్రీడాకారులు

కర్నూలు (టౌన్): ఈనెల 10 నుంచి 12 వ తేదీ వరకు అహ్మదాబాద్‌లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు ప్రతిభ చాటాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ ఆకాంక్షించారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జాతీయ పోటీలకు ఎంపికయిన కర్నూలు క్రీడాకారులు అలెక్స్ మ్యాథ్యూస్, వెన్నెలను ఆయన అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు.

ఆర్‌యూలో ముగిసిన క్రీడా పోటీలు

కర్నూలు (టౌన్) : రాయలసీమ యూనివర్సిటీలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో సెపక్‌తక్రా విభాగంలో ఆదోని ఆర్ట్స్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల జట్టు, మూడో స్థానంలో ఉస్మానియా కళాశాల జట్టు నిలిచాయి. హ్యాండ్‌బాల్ విభాగంలో ఉస్మానియా డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల జట్టు, మూడవ స్థానంలో రాయలసీమ యూనివర్సిటీ జట్టు విజేతగా నిలిచింది. ఫుట్‌బాల్ విభాగంలో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల జట్టు, మూడవ స్థానంలో రాయలసీమ యూనివర్సిటీ జట్టు నిలిచింది. విజేత జట్లకు యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య సీవీ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రార్ సుందరానంద పుచ్చ, స్పోర్ట్స్ డైరెక్టర్ శివకిషోర్ ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు, వ్యక్తిగత బహుమతులు అందజేశారు.

సంక్షిప్తం

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

కర్నూలు(సెంట్రల్): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంపై ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు బాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. నాయకులు దామోదరం రాధాకృష్ణ, బతుకన్న, పోతుల శేఖర ఖాజా హుస్సేన్, ఎస్.ప్రమీల, ఎ.సుజాత, రియాజ్, లాజరస్ పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవం

కర్నూలు కల్చరల్: మూడు రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో స్థానిక ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. పార్టీ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామస్వామి, సీనియర్ నాయకులు పూల రంగస్వామి, రాఘవులు, సందడి సుధాకర్, మదన మోహన్ ఆచారి, రాఘవేంద్ర, సూర్యకుమార్ తదితరులు ఉన్నారు.

మనోహర్ మాణిక్యంకు పరామర్శ

కర్నూలు(సెంట్రల్): సీపీఐ సీనియర్ నాయకుడు మనోహర్ మాణిక్యం భార్య ఈశ్వరమ్మ రెండురోజుల క్రితం అనారోగ్యంతో మరణించింది. ఆ రోజు సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యుడైన పి.రామచంద్రయ్య అందుబాటులో లేకపోవడంతో ఆదివారం మనోహర్‌మాణిక్యంను పరామర్శించి ధైర్యం చెప్పారు.

తెలుగు సాహిత్యాన్ని విస్తృతం చేస్తాం


సంస్థ ఆవిర్భావ ప్రకటన ప్రతులను ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: తెలుగు సాహిత్యాన్ని విస్తృతం చేస్తామని తెలుగు సారస్వత వైభవం సాహితీ సంస్థ అధ్యక్షుడు గొరెడ్డి హరిశ్చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో సంస్థ ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వాళ్లకు ఉన్న సాహిత్య సంపద చాలా గొప్పదన్నారు. దాన్ని నలుగురికి పంచడం కోసమే సంస్థను ఏర్పాటు చేశామన్నారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, రామచంద్రనాయుడు, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్‌ఆర్కే శర్మ అతిథులుగా హాజరై సంస్థను ప్రారంభించి ప్రసంగించారు. తెలుగు కవులు, రచయితలను ప్రోత్సహించేందుకు సంస్థను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో నరసం అధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ, కవులు, రచయితలు హనుమంతప్ప, ఎలమర్తి రమణయ్య, రామాంజనేయులు, లీలావతి, రంగారెడ్డి, గంగిరెడ్డి, ఇనాయతుల్లా, హరికిషన్, మహమ్మద్ మియ్యా, లక్ష్మయ్య, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథగట్టులో రేగు చెట్ల అభివృద్ధికి చొరవ


రేగు పండ్లు వెదజల్లుతున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): విశ్రాంత అటవీ అధికారి జయచంద్రారెడ్డి, వర్మి కంపోస్టు ఎరువు తయారీలో రాణిస్తున్న హరికృష్ణ, ఎస్‌బీఐ ఉద్యోగి కృష్ణవేణి తదితరులు రేగు విత్తనాలను ఆదివారం జగన్నాథగట్టు కొండల్లో వెదజల్లారు. ఈ సందర్భంగా విశ్రాంత అటవీ అధికారి మాట్లాడుతూ... జగన్నాథగట్టులో పచ్చదనం అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులతో కలసి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కొండల్లో చల్లిన ఎండు రేగుపండ్లు మట్టిలో కలసిపోయి వర్షాకాలంలో మొలకెత్తే అవకాశం ఉందని తెలిపారు. చల్లిన వాటికి కనీసం 100 మొలకలు వచ్చిన మా శ్రమ ఫలించినట్లేనని పేర్కొన్నారు.రేగు చెట్లు అభివృద్ధి చెందితే పశుపక్ష్యాదులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.

దేశానికి వ్యవసాయ సంక్షోభం మంచిదికాదు

- ప్రభుత్వాలు అన్నదాతలను ఆదుకోవాలి
- ఏఐకేఎస్ అఖిల భారత ఉపాధ్యక్షుడు టి.సాగర్, మాజీ వ్యవసాయ శాఖమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐకేఎస్ అఖిలభారత ఉపాధ్యక్షుడు టి.సాగర్

కర్నూలు(సెంట్రల్): దేశానికి వ్యవసాయ సంక్షోభం మంచిది కాదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాతలకు సాయం అందించి ఆదుకోవాలని ఏఐకేఎస్ అఖిలభారత ఉపాధ్యక్షుడు టి.సాగర్, మాజీ వ్యవసాయ శాఖమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు కోరారు. ఆదివారం కర్నూలు ఎంపీపీ హాలులో ఏపీ రైతు సంఘం జిల్లాకార్యదర్శి జి.రామకృష్ణ అధ్యక్షతన రేపటి వ్యవసాయ సంక్షోభం-కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐకేఎస్ అఖిలభారత ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ. ఎంఎస్ స్వామి నాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేసి వ్యవసాయాన్ని పండుగ చేస్తానన్న మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడంలేదన్నారు. ఎప్పుడైతే రైతు తాను పండించిన పంటకు ధర నిర్ణయిస్తాడో ఆరోజే వారి ఆత్మహత్యలు నిలిచిపోతాయన్నారు. మాజీ వ్యవసాయ శాఖమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ..20 సంవత్సరాల్లో కోటి మంది రైతులు వ్యవసాయేతర పనులకు వెళ్లిపోయారని, ఇదే సంక్షోభానికి నిదర్శనమన్నారు. ఈ పరిణామం భవిష్యత్‌లో ఆహార కొరతకు దారితీస్తుందన్నారు. దేశానికి అన్నం పెడుతున్న రైతన్నలకు బ్యాంకులు రుణాలు ఇవ్వడంలేదని, దేశం విడిచి పెట్టి పారిపోయే వ్యాపారులకు రుణాలు ఇవ్వడం అభ్యంతరకరమన్నారు. దేశంలో 60 శాతం పంటలు వర్షాధారమేనని, అన్నదాతను ఆదుకోకపోతే బతికేది ఎలా అన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ..ఈనెల 15,16,17 తేదీల్లో కర్నూలులో జరిగే జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాయలసీమలో సాగునీటి వనరులను పెంచాలని రాయలసీమ సాగునీటిసాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి, ఏపీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి రాజశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల ఆహ్వాన సంఘం నాయకులు ప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

సంక్షేమ సారథి వైఎస్ జగన్


ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ సమక్షంలో వైఎస్ఆర్‌సీపీలో చేరిన లక్ష్మీనగర్ వాసులు

కర్నూలు(హాస్పిటల్): పేద ప్రజల సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం రాత్రి కర్నూలులోని 24వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లక్ష్మీ నగర్ కేసీ కెనాల్ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలు, ఇబ్బందులు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా బలహీన వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఆయన వెంట నాయకులు గద్దం రామకృష్ణ, సయ్యద్ ఆసిఫ్, రాజు, సునీల్, సుచరిత, అర్జున్, అబ్బాస్ అలీ, అనీస్‌ఖాన్, మల్లికార్జున్‌రెడ్డి, కల్పన, పి. కిశోర్, పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీలో చేరిన 20 కుటుంబాలు

గడప గడపకు మన ప్రభుత్వాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ సమక్షంలో స్థానిక 24వ వార్డు లక్ష్మీనగర్‌లోని గౌసియా కాంప్లెక్స్‌కు చెందిన 20 కుటుంబాలు వైఎస్ఆర్‌సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో స్థానికులు స్వర్ణలత, మేరమ్మ, బి. జ్యోతి, జాస్లిమ్, ఎం.దీప్తి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు, రాష్ట్ర అభివృద్ధికి ఆకర్షితులై వారు వైఎస్ఆర్‌సీపీలో చేరినట్లు తెలిపారు.